# దేవతలు, డైరెక్ట్ సేల్సు

మహేష్ శనగం

**అనగనగా** ఒక రోజు దేవతలందరు ఇంద్రుని ఆహ్వానంపై స్వర్గంలో సమావేశమయ్యారు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు, సరస్వతి, లక్ష్మి, పార్వతి వారి కుటుంబ బంధువర్గాలతోవచ్చి ఉన్నారు. నారదుడు, బృహస్పతి మొదలుగా దేవలోకంలో ఉన్న ఋషివర్గాలు సమస్తం సభలో ఆశీనులై ఉన్నారు.

"సహోదర సహోదరీమణులారా! ఈ రహస్య సమావేశంబెందులకు ఏర్పాటు జేసితిమని మీరందరూ ఎంతయో ఉత్కంఠతో వేచి చూచుచుంటిరని మాకు విశదము. కానీ దేవలోక నిర్వాహకసమితి మీ ముందుంచబోవు ఇయ్యది ప్రతిపాదన బయటకు ప్రాక్క రాదను సదుద్దేశ్యంబుతో ఈ ముందు జాగ్రత్త చర్యలు దీసుకోవడంబైనది." నుదుటన చిరు చెమటలు తుడుచుకుంటూ అన్నాడు ఇంద్రుడు. "కాంచన సన్నిభులైన బృహస్పతీగురువర్యులిపుడు సభాధ్యక్షత బాధ్యతలు స్వీకరింపవలయునని మా ఈ సవినయ విన్నపం" అని తన సింహాసనాశీనుడయ్యాడు ఇంద్రుడు. ప్రక్కన దేవ పరిచారికలు చామరలు వూపుతున్నారు.

స్వర్గంలో ఎయిర్ కండీషనింగ్ పై కోత విధించ వలసి వచ్చింది నిధులు లేక. స్వర్గం ఇప్పుడొక పాత బడిన త్రీస్టార్ హోటల్‌లా ఉంది. పెచ్చులూడిన గోడలు, పాత బడిన ఫర్నిచర్, వయసు పైబడిన అప్సరసలు. ఇంతకు మించిన సౌఖ్యాలు, ఫైవ్ స్టార్ హోటళ్ళలో ఇప్పుడు భూలోకంలోనే దొరుకుతున్నాయి. స్వర్గానికి పడిపోతున్న డిమాండును, మరియూ ఆదాయం గురించి స్వర్గం మానేజింగ్ బోర్డుకి సమాధానాలు చెప్పుకోలేక ఇంద్రుడు సతమతమై పోతున్నాడు. పెరిగిపోతున్న అప్పులు తీర్చడానికి ఇంద్రుడు వజ్రాయుధాన్ని కుబేరుడి వద్ద తాకట్టు పెట్టాడని దేవలోకంలో అభిజ్ఞానవర్గాల భోగట్టా. మొత్తానికి దేవ

## కార్టూను పద్యాలు – తల్లాప్రగడ

సీ// శ్రీరామజయరామ శరధారి రఘురామ,
నీనామమేనయ్య నిన్ను మించు!
అల కోతి మూకల అలనాటి వారదే,
కావలనొచ్చేను కడలి దాట!
వంతెనే లేకుండ గెంతేను హనుమంతు,
పౌంతమే లేదయ్య పింత పినుమ!
నీదివ్యనామమే ఇతగాని బలమవ్వ,
నీనామ మహిమచే నిన్ను మించె!



గణాలు భూలోకంలో పౌరాణిక నాటకాలువేసే నటీనట వర్గంలా ఉన్నారు. స్వర్గలోకం నాటకం సెట్టులా ఉంది.

"మన ఘన చరిత్ర, వైభవం, శోభ అన్నీ కేవలం పురాణాలకి, బుర్ర కథలకీ, భూలోకంలో ఎన్టీ రామారావ్ పాత సినిమాలకీ మాత్రమే నిమిత్తమైపోయింది. ఈ రోజు సగటు దేవతల పరిస్థితేమిటన్నది ఎవ్వరూ పట్టించుకోవడం లేదు." అని మొదలు పెట్టాడు బృహస్పతి.

"ఒకప్పుడు ప్రపంచాన్నేలిన దేవతా గణాలు, ఇప్పుడు ఎవ్వరూ పట్టించుకోని దీనావస్థలో ఉన్నారు. ఒకప్పుడు ఆకాశం నుండి టన్నుల కొద్దీ పూలవర్షాలు కురిపించిన వారు, ఇప్పుడు పూల ఖరీదు పెరిగిపోయి పని చెయ్యడం మానేశారు. మనం పూలవర్షం కురిపించి ఎన్నేళ్ళు ... కాదు కాదు, ఎన్ని యుగాలైందో కదా!" అని నిట్టూర్చాడు దేవ గురువు. "ఆఖరికి బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు కూడా తమతమ ధర్మాలని నెరవేర్చలేక పోతున్నారు. వీటన్నిటికీ కారణాలేమిటన్నది మనం చర్చించాలనీ, మన సమస్యలకి పరిష్కారం కనిపెట్టాలనీ నా ఆకాంక్ష. ఐతే నేను ముందుగా చెప్పేదేమిటంటే, సగటు మానవుడికి కూడా అర్థమయ్యేలా మనం సామాన్యమైన వ్యావహారిక భాషలో మనం మాట్లాడుకుందాం. అంతే కాదు, ఇకనుండి మన వేషధారణ కూడా దేశకాలానుగుణంగా, నిరాడంబరంగా మార్చుకుందాం. అసలే బంగారం ధర నింగినంటుతున్నది, పట్టు వస్త్రాలపై మన పట్టు సడలుతున్నది!" అని హితవు పలికాడు లాల్చీ పంచె కట్టుకున్న గురుడు.

ముందుగా సృష్టికర్త బ్రహ్మ ఇలా మొదలు పెట్టాడు: "ఏమి చెప్పమంటారు అధ్యక్షా! నా సృష్టికి ప్రతిసృష్టి చేస్తున్నారు మానవులు! టెస్టు ట్యూబులతో

సెనగల మహేష్ గారు యూనివర్శిటీ ఆఫ్ టెక్సాస్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా చేస్తూ, కథలు కూడా వ్రాస్తూ ఉంటారు. పౌరాణిక, వాస్తవిక రచనలు వారిని ఎంతో ప్రభావితం చేసాయి.

మొదలైన ప్రతిసృష్టి ఇప్పుడు క్లోనింగ్ వరకు వచ్చేసింది. ఫెర్టిలిటీ మందులతో ఒకే కాన్పులో పది మందిని పడీపడీ కనేస్తున్నారు ఈ రోజుల్లో! పెళ్ళాలకి మొగుళ్ళవసరం లేదు. అసలు మొగుడికే మొగుళ్ళు వచ్చేస్తున్నారు. జెనెటిక్ ఇంజినీర్లు బ్రహ్మ రాతని తిరగ రాస్తున్నారు. బ్రహ్మవిద్యకీ, దేవలోక టెక్నాలజీకీ విలువ, గిరాకీ పడిపోయింది అధ్యక్షా!" అంటూ తన గోడు వెళ్ళబోసుకున్నాడు బ్రహ్మ దేవుడు.

"మీకంటే పెద్దగా గుడులూ గట్రా ఉండవు. దానితో మీ సర్వీసులు, ఉత్పత్తులు ప్రజలకి తెలియడం కష్టమైపోతుందనుకోవచ్చు విధాతా!" అని మొదలు పెట్టాడు విష్ణుమూర్తి. "అధ్యక్షా, సభాసదులారా, వేలాదివేల గుడులున్న నాకే ఈ విషయాల్లో గడ్డు కాలం వచ్చేసింది. నా పేరు చెప్పుకుని మధ్యవర్తులు, స్వామీజీలూ, దేవాదాయ శాఖలు, పూజార్లు కలిసి డబ్బు చేసుకుంటున్నారు. నా ప్రమేయం లేకుండా నా సర్వీసులు, వరాలు, ఆశీస్సులు వగైరా అన్నీ ఇచ్చేస్తున్నారు. ఎప్పుడో కృష్ణావతారంలో పార్థుడికి చెప్పిన ద్వాపరయుగం ఎడిషన్ గీతనే, ఈ కలియుగంలోనూ పట్టుకుని వేళ్ళాడుతున్నారు ప్రజలు. యేడాదికో వెర్షన్ విడుదల చేస్తున్న సాఫ్ట్‌వేర్లకే గతిలేదు. ఇక వేల సంవత్సరాల క్రితం పబ్లిష్ చేసిన గీత సంగతేం కాను! కనీసం దాన్ని అప్‌డేట్ చేసే అవకాశం కూడా

ఇవ్వడంలేదెవ్వరూ, అధ్యక్షా! ఒహ వేళ చేసినా దాన్ని చదూతారని నమ్మకం కూడా లేదు. కనీస హక్కులు కూడా నాకు లేవని, కాపీరైట్ కేసు నా మీద వెయ్యకుంటే అదే పది వేలు. అలానే యుగాల క్రితం వ్రాసిన విష్ణు సహస్రనామం తర్వాత విష్ణు శత సహస్ర నామాలు వెలువడతాయేమో, అన్న నా ఆశ కూడా అడియాశే అయ్యింది. ఆఖరికి ఐ-మాక్స్ థియేటర్లు వచ్చిన, ఈ రోజుల్లో నా విశ్వరూప ప్రదర్శనకి అస్సలాస్కారమే లేక పోతోంది అధ్యక్షా!" అని తన వేదనని వెళ్ళగ్రక్కుకున్నాడు పద్మనాభుడు.

ఇదంతా వింటున్న దేవగణాల నరనరాల్లోనూ ఆగ్రహం, వ్యధ ప్రవహించాయి. ఇప్పుడు పరమేశ్వరుడి వంతు వచ్చింది.

"సృష్టి, స్థితి కారకులకి గడ్డు కాలం వచ్చిందంటే కొంత ఐనా నమ్మవచ్చు అధ్యక్షా! కాని, లయ వినాశకారకుడిని నాకు కూడా కష్ట కాలం వచ్చిందని చెప్పుకోవడనికే నాకు..." గరళకంటుడి గొంతు దగ్ధమయ్యింది. కాస్త గంగ తీర్థం నోట్లో వేసుకుని మళ్ళీ చెప్పడం మొదలు పెట్టాడు శివుడు. "ఏదో ఏటేటా నేను, వరుణ దేవుడు, వాయు దేవుడు కలిసి పంపే హరికేనులు, అప్పుడప్పుడూ భూదేవికి అవుట్ సోర్స్ చేసిన సునామీలు, అగ్నిదేవుడి డిపార్ట్‌మెంట్ ద్వారా డెలివర్ చేసే అగ్నిపర్వతాల విస్ఫోటనల జాబితాలన్నీ కలిపినా, మానవులు తమంత తామే చేసుకునే వినాశనానికి సరిపోవడం లేదు. జాతి, కులం, మతం పేరులు చెప్పుకుని వేలకి వేలుగా సర్వేజన సంహారాలు జరుగుతూనే ఉన్నాయి. నాతో పని లేకుండా అణుబాంబులు వగైరా కుప్పలు కుప్పలుగా వేసుకుని, ప్రళయానికి వారంతట వారే దారులు వెదుక్కుంటున్నారు. నా తాండవ నాట్యానికి అవకాశం, అవసరం ఇప్పుడేమ్రాత్రం లేవు, అధ్యక్షా!" నీలకంఠుడే ఇలా అనే సరికి దేవతలందరిలో కలకలం మొదలయ్యింది.

"నిశ్శబ్దం! నిశ్శబ్దం!" అని తన దండంతో బల్ల మీద గట్టిగా కొట్టాడు బృహస్పతి. ఒక నిమిషం సభాసదులందరినీ చూచి అత్యంత గంభీరంగా అన్నాడు బృహస్పతి. "దీన్ని బట్టి అర్ధమయ్యిందేమిటంటే, మానవ ప్రజానీకంలో యుగాల తరబడీనుండీ ఉన్న అపోహలని తొలగించడానికి, ఈ కంప్యూటర్ యుగంలో, ఈ బయోటెక్నాలజీ తరంలో మన ప్రాముఖ్యతను రక్షించు కోవడానికి, మనమేదైనా చెయ్యాలి. ఈ విషయం గురించి లక్ష్మీ, పార్వతి, సరస్వతులను అధ్యయనం చెయ్యమని నేను కోరాను, వారు అంగీకరించారు." అన్నాడు బృహస్పతి. "ఏమ్మా, లక్ష్మీ, పార్వతీ, సరస్వతీ, మరి మీరు కనిపెట్టిన విషయాలని మాకు విశదీకరించండి."

ముందుగా సరస్వతీ దేవి ఇలా అంది: "దేవతా

## కార్టూను పద్యాలు – తల్లాప్రగడ

తె.గీ// నింగి లో మెఱయు మెఱుపే నిలవలేదు!
ఇంత ఉరుమైనా శబ్దమ్ము నిలిచి పోదు!
వయసు సొగసులేలను నిలువ గలవయ్య!
రమ్య గుణగణధామ శ్రీరామచంద్ర!



వనితల సొసైటీలో ఈ విషయాలనే గత కొన్ని యుగాలుగా చర్చిస్తున్నాం, అధ్యక్షా.'' లక్ష్మీ దేవి మధ్యలో ఇలా అందుకుంది: ''ఈ అధ్యయనంలో భాగంగా మేం అన్నిలోకాలలో కొన్ని కేస్ స్టడీలు కూడా చేశాం, అధ్యక్షా.'' ''వినాయకుడిని, కుమారస్వామిని పంపి భూలోక, భువర్లోక, సువర్లోకాది సర్వలోకాలలోను ఉన్న సంస్థలు, వ్యాపారాలు, విధానాలు క్షుణ్ణంగా పరిశీలించాం, అధ్యక్షా.'' అంది పార్వతీ దేవి.

''ఇంతకీ తేలిందేమిటంటే, మన సమస్యలన్నీ మధ్యవర్తుల వల్ల వచ్చినవే. పూజార్ల నుండి స్వామీజీల వరకు, గుళ్ళనుండి పీఠాల వరకు, మానవులే మన తరపున వకాల్తా పుచ్చుకుని మనల్ని తెర మరుగు చేసేశారు. భూలోకంలో ఏ విధంగా డాక్టర్లని హెచ్.ఎం.ఓ.లు మింగేశాయో, అదే విధంగా మనల్ని మధ్యలో మనుషులు మిధ్యగా తయారు చేశారు. అలా అని మధ్య తరగతి మానవులు నమ్మేశారు. మనం ప్రజలతో తిన్నగా మాట్లాడగలిగే మార్గాలన్నీ ఆక్రమించేసారు.. ఆఖరికి... ఆఖరికి మనల్ని, మహత్తర శక్తులున్న, అపరిమిత విజ్ఞాన దాతలైన దేవతలని వదిలి మనుషులు మనుషులనే పూజలు చేసుకుంటున్నారు, అధ్యక్షా!'' అని చెపుతుండగా సరస్వతీ మాత కళ్ళవెంట అశృవులు ధారలుగా కారాయి బ్రహ్మదేవుడు సరస్వతిని దగ్గరకు తీసుకుని, తల నిమిర్చి ఓదార్చాడు.

సభ యావత్తూ చీమ చిటుక్కుమన్నా వినపడగలిగే నిశ్శబ్దం ఆవరించి ఉంది.

స్వర్ణ వర్ణంలో ఉన్న ఒక పుస్తకాన్ని లక్ష్మీ దేవి బృహస్పతి ముందుంచింది. దానిపై అందమైన అక్షరాలలో వ్రాసి ఉంది: ''దేవతలు భక్తుల మధ్య ప్రత్యక్ష అనుసంధానం: ఒక ప్రతిపాదన''

*** *** ***

మర్నాడు స్వర్గలోకంలో ''ఇంద్రలోకప్రభ'' వార్తాపత్రికలో సంచలనాత్మక వ్యాపార ప్రతిపాదన వివరాలన్నీ ప్రచురితమయ్యాయి. వాటిలో ముఖ్యాంశాలు:

- ఇకపై దేవదళారులను, అంటే స్వామీజీలను, పూజార్లను, మతసంస్థలను, సొసైటీలను దేవతలు భక్తుల మధ్య నుండి తప్పించడం.

- దేవతలే తిన్నగా ప్రజలందరితో సంబంధాలు ఏర్పరచుకోవడం.

- భక్తులకు దైవ సంబంధ విషయాలన్నీ ఎప్పటికప్పుడు తెలియడానికి ఒక దేవలోక వెబ్ పోర్టల్ నిర్మించడం.

- ప్రజలకందరికీ అర్ధమయ్యేలా సామాన్యమైన వాడుక భాషలో దేవతలు మాట్లాడడం.

- ప్రజల కష్టాలు తీర్చడానికి ఆఘమేఘాలపై దేవతలు వచ్చేలా కస్టమర్ సర్వీస్ విభాగం ఏర్పాటు.

*** *** ***

దేవతల సమావేశం జరిగి పది రోజులయ్యింది.

''నారాయణ! నారాయణ!'' అంటు ఇంద్రుడిని పలకరించాడు నారదుడు, ఇంద్రుడి ఉద్యానవనంలో ప్రవేశిస్తూ.

''రండి విప్రోత్తమా, ఊరక రారు మహాత్ములు. తమరి రాకకు కారణమేమి?''

''ఇంద్రా, ఇప్పుడే భూలోకం నుండి వస్తున్నాను. అమలాపురం నుండి అమెరికావరకు అన్ని దేశాలు, ప్రదేశాలూ తిరిగాను. కాని ఏమి చెప్పమంటావ్ ఇంద్రా...''

అంటూ కాస్త సందిగ్ధత వ్యక్తం చేశాడు నారదుడు.

అసలే ఇంద్రుడికి ఈమధ్య రక్తపోటు ఎక్కువైంది. నారదుడు ఇలా సస్పెన్స్‌లో ఉంచడంతో ఏదో చెడ్డ వార్త ఉందని అనుమానం వచ్చేసింది. "త్వరగా చెప్పవయ్యా, చెప్పు!" అని తొందర పెట్టాడు ఇంద్రుడు." మన సమావేశ విషయాలన్నీ భూలోకంలో ఉన్న దేవదళారులందరికీ తెలిసిపోయాయి ఇంద్రా!"

"అదెలా సాధ్యం? ఇంద్రలోకంలో మానవులెలా చొరబడగలరు? మన రహస్య భాషణములెలా బయటకు చేరవేయబడగలవు? నా లెక్క ప్రకారం బొందితో స్వర్గానికి రావడానికి గత వెయ్యి సంవత్సరాలుగా ఏ మానవులకూ మేము వీసాలు ఇవ్వలేదు. ఇది అసంభవం!" అని గర్జించాడు ఇంద్రుడు.

"చూడు ఇంద్రా, విషయ సూక్ష్మాలేవీ నాకు తెలియదు. అక్రమంగా గోడలు దూకి, ఎడార్లు దాటి, సముద్రాలు ఈది అమెరికాకే చట్ట విరుద్ధ పరదేశీయులు వస్తుండగా ఇక స్వర్గం ఒక లెక్కా? అయినా దేవతలెవరో ఈ విషయాలు భూలోకానికి చేరవేస్తుండవచ్చు కూడానూ" అని వ్యంగ్యంగా అన్నాడు నారదుడు. "అయినా అసలు విషయానికి వద్దాం. మన సమావేశం వీడియో, ప్రతిపాదన వివరాలు అన్నీ కాంపాక్టుడిస్కు అనే చక్రాల మీద పొందు పరచి భూలోకంలో ఉన్న దేవదళారులందరికీ పంపిణీ చేశారెవరో!"

"హా, హతవిధీ! ఉన్న పరువు కూడా గంగలో కలిసేన్!" అని నుదిటి మీద చేయి వేసుకుని వాపోయాడు ఇంద్రుడు.

"అంతే కాదు ఇంద్రా, ప్రపంచ దేవ దళారుల సంఘం అని వారందరూ ఒక యూనియన్ కూడా ఏర్పాటు చేసుకున్నారు. ప్రపంచ స్వామీజీలూ ఏకంకండి, దేవుళ్ళు డౌన్ డౌన్, ఇంద్రుడి నిరంకుశత్వం నశించాలి! వగైరా నినాదాలు చేస్తూ ప్రదర్శనలూ ధర్నాలూ చేస్తున్నారు. రేపేమో ప్రపంచ బంద్ అని పిలుపు కూడా ఇచ్చారు!"

ఇంద్రుడు ఉన్నపళానే ఉద్యానవనం మేఘాలలో చతికిలపడ్డాడు తల మీద చేతులువేసుకుని. "నారదా, ఇంకా ఏమేమి చేస్తున్నారయ్యా ఈ మానవులు?" అని అడిగాడు ఇంద్రుడు.

"చెప్తా చెప్తా! దళారులు అలా ఉంటే, కనీసం భక్తులైనా దేవతల పక్షాన ఉంటారేమోనని కొందరి కలల్లో నేను దర్శనమిచ్చి అడిగాను ఇంద్రా. ఎక్కడో కనిపించని, వినిపించని దూరాన ఉంటూ, మాకర్థం కాని వేషభాషలతో నూటికో కోటికో ఒక్కరికి మాత్రం కనిపించే దేవుళ్ళకన్నా, మా కళ్ళ ముందు ఉండి మాతో మాట్లాడి, మాకు వరాలిచ్చి మమ్మల్ని ప్రేమతో చూసుకొనే స్వామీజీలే మాకు కావాలని భక్తులంతా అంటున్నారు దేవేంద్రా!"

ఇంతలో బృహస్పతి అటుగా వచ్చాడు. నారదుడిని కాస్త అనుమానంగా చూశాడు. ఊరకరాడు ఈ బ్రాహ్మడు, ఇంద్రుడికి ఏం నూరి పోస్తున్నాడో అని లోలోనే అనుకుంటూ ఇలా అన్నాడు: "ఏమయ్యా ఇంద్రా, ఏదో వృత్తాసురుడిని చూసినట్లు ముఖం అలా పెట్టావ్? ఈ కలహభోజనుడేమి కథలు వినిపిస్తున్నాడు?"

"నారాయణ! నారాయణ! అంత అభాండాలు వెయ్యనక్కర్లేదు గురుప్రముఖా! ఇహలోకంలో వార్తావిశేషాల్ని ఇంద్రలోకానికి చేరవేస్తున్నానంతే. అదీ దేవతల మంచిని దృష్టిలో పెట్టుకుని అష్టకష్టాలకోర్చి నేను చేస్తున్న ఉడతా సాయం." అని సమాధానం చెప్పుకున్నాడు నారదుడు.

విషయం విని ఖంగు తినడం బృహస్పతి వంతయ్యింది. మానవుల్ని తక్కువగా అంచనా వేశామని అనుకున్నాడు. వెంటనే తర్వాతి ఎత్తుగడలు చర్చించడానికి అత్యవసర దేవసమాఖ్య సమావేశాన్ని ఏర్పాటు చేశాడు.

"మనం వెంటనే ప్రజలతో తిన్నగా మాట్లాడదాం" అని కొందరు

"ప్రజలు మనతో మాట్లాడటానికి ఉచిత ఫోను సౌకర్యం ఏర్పాటు చేద్దాం" అని మరి కొందరు

"మన గొప్పదనం, విలువ, ప్రాముఖ్యత తెలియ చెప్పడానికి భూలోకంలోని అన్ని ప్రసార మాధ్యమాల్లో మన ప్రకటనలు విడుదల చెయ్యాలి" అని ఇంకొందరు సలహాలిచ్చారు.

"అన్నీ బాగానే ఉన్నాయి. అలానే చేద్దాం" అని నిశ్చయించాడు బృహస్పతి.

కానీ తానొకటి తలిస్తే దైవమొకటి తలిచిందంటారు. ఇవన్నీ చెయ్యాలంటే చాల డబ్బుతో కూడిన విషయం.

కుబేరుడు "నా ధనమంతా వేంకటేశ్వరుడికి అప్పిచ్చేసరికి నా ఖజానా అంతా గుల్ల అయిపోయింది. వారు కేవలం వడ్డీనే చెల్లిస్తున్నారు గాని అసలుకు గతిలేదు, ఇక నా వద్ద డబ్బులేద"న్నాడు. గత్యంతరం లేక లక్ష్మీదేవి భూలోకంలో బ్యాంకుల్లో అప్పు తీసుకోవాల్సి వచ్చింది, అవీ ఇవీ తాకట్టు పెట్టి.

*** *** ***

కొలువులో దిగాలుగా కూర్చున్న ఇంద్రుడి సమక్షంలోకి రొప్పుకుంటు వచ్చి ఇలా గడగడా చెప్పింది ఒక దేవ వనిత:

"దేవేంద్రా, మనం ఏర్పాటు చేసిన ఫోన్‌లకి ప్రతి అడ్డమైనవాడు చేసి ఏవేవో పేలుతున్నారు. అగ్గిపెట్టుందా అని ఓ వెధవ, మా బ్రాండు సాంబ్రాణి కొంటావా అని ఓ దగుల్బాజీ కంపెనీ, మనమేమి షాంపూలు వాడతామని ఒక మార్కెట్ సర్వే వనిత, ఇలా మా దుంప తెంచేస్తున్నారు ప్రభూ. మధ్య మధ్యలో ఎవడో దేవదళారుల విప్లవకారుడట బృహస్పతింట్లో బాంబులు పెడతానని, ఇంక్విలాబ్ జిందాబాద్ అని బెదిరించాడు స్వామీ! ఓ అర్భకుడేమో నాతో సినిమాకి వస్తావా, ఇంద్ర పార్కులు దేనికి, ఇందిరా పార్కుకి రా! అని నన్నేడిపించడం మొదలెట్టాడు ప్రభూ!"

ఇంతలోనే మరో దేవుడు పరిగెత్తుకుంటు వచ్చాడు.

"నువ్వేం కొంపముంచే వార్తలు తెచ్చావురా" అని విసుగ్గా అడిగాడు బృహస్పతి.

"భూలోకంనుండి దేవదళారుల యూనియన్ తరపున వకీలట, ఫోన్ చేశాడు" అన్నాడు సగటు దేవుడు. "వాళ్ళ మార్కెట్లో మనం అక్రమంగా చొరబడి వాళ్ళ హక్కులు, లాభాలు, జీవనోపాధి లాక్కుంటున్నామని హైకోర్ట్‌లో వ్యాజ్యం వేస్తానని ఫోనులో బెదిరిస్తున్నాడు ప్రభూ!"

"వృత్తాసురులు వెయ్యిమందొచ్చినా తట్టు కోగలను గానీ ఈ వకీళ్ళు, యూనియన్‌ల వ్యవహారాలు నావల్ల కాదంటే కాదు!" అని ఆ రోజుకి కొలువు చాలించి తన శయనమందిరానికి వెళ్ళిపోయాడు ఇంద్రుడు.

తర్వాతి రోజు, దేవతలందరు కలిసి "కంటికెదురుగా కనిపించనత వరకే మన విలువ. మనుషులతో పోటీ పడితే ఓడిపోయేది మనమే! బతికుంటే స్వర్గంలో బలుసాకు తింటూ మన గౌరవాన్ని

కాపాడుకోవచ్చు. ఈ దేవదళారుల యూనియన్ బెదిరింపులు, ధర్నాలు, మానవుల వేధింపులు తట్టుకోవడం మాత్రం మన వల్ల కాదు." అని ఒక తీర్మానం చేశారు. "ఇక మన దేవలోక సర్వీసులు, వరాలు, మహిమలు, దీనజన రక్షణ, ఆర్తజనోద్ధారణ వంటి సాధారణ వ్యవహారాలు మనం అధికారికంగా భూలోకంలో ముఖ్యంగా భారతదేశంలో ఉన్న మానవులకే 'అవుట్ సోర్సు' చేసేస్తే మనకు ఖర్చులూ తగ్గుతాయి, మానము, మర్యాద దక్కుతాయి," అని నిర్ధారణ చేశారు. అప్పటినుండి మనుషులకి దాదాపు బానిసలుగా బ్రతుకుతున్నారు సగటు దేవతలు.

కెవ్వున కేక పెట్టి ఒక్క ఉదుటన లేచి కూర్చున్నాడు ఇంద్రుడు. ఎంత పీడకల! అనుకున్నాడు. అలా జరగడానికి ఇంకెంతో కాలం పట్టదని కూడా గ్రహించాడు. "ఇక త్రిమూర్తులే ఏదో దిక్కు చూపించాలి!" అని కబురంపాడు.

త్రిమూర్తులు స్వర్గానికి విచ్చేశారు. బెంబేలెత్తి పోతున్న ఇంద్రుడిని చూసి ఇలా అన్నారు "గాభరా పడకు సురేశ్వరా! త్రికాలజ్ఞానులము, సర్వాంతర్యాములము అయిన మాకు తెలియని విషయాలుంటాయా? అసంభవమైన పనులుంటాయా? దేవతలకి గర్వం, అహంకారం, బద్ధకం పెరిగిపోవడం వల్ల దేవలోకం ఒక వెనకబడిన దేశంలా మారిపోయింది. ఇది దేవతలకందరికీ గుణపాఠం చెప్పడానికి మేమాడిన చిన్న నాటకం!" అని సెలవిచ్చారు త్రిమూర్తులు.

"జగన్నాటకధారులు! ఇహ ఇప్పటినుండి మేమెలా నడుచుకోవాలో తమరే సెలవివ్వాలి" అన్నాడు ఇంద్రుడు.

"మానవలోకంలో పరస్పర విరుద్ధమైన గుణాలు, ప్రవర్తనలు, నడవడికలు ఉంటాయి. స్వర్గంలా ఎప్పుడూ ఒకేలా ఉంటే జరగదు అభివృద్ధి, పరిణామం. ఈ విషయాన్ని మీరు ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఇకపైనుండి దేవతలు మానవలోకంలో, మనుష్యుల మధ్య ఉంటూ మానవ జన్మ యొక్క ఔన్నత్యాన్ని తెలుసుకోవాలి. యుగానికోసారి మానవ జన్మనెత్తడం అనేది పురాణ కాలంనాటి పద్ధతి. దేవతలుగా పుట్టి దేవతలుగా బ్రతకటంలో లేదు విజ్ఞత. మానవులుగా పుట్టి అజ్ఞాన సాగరంలో కొట్టుమిట్టాడడంలోనూ లేదు విజ్ఞత. అమరులు మానవ జన్మనెంచుకుని తమ అస్తిత్వానికి అర్థం గ్రహించడం, మానవులు తమ మర్త్యత్వాన్ని అధిగమించి దైవ గుణాలకై శ్రమించడమే వారివారి జన్మలకు అర్థాన్నిస్తుంది." అని తమ నాటకంలోని అంతరార్థం ప్రభోధించి అంతర్ధానమయ్యారు త్రిమూర్తులు. ❑

